ఇసుక అందక నిర్మాణ రంగం కుదేలు

- ఆన్‌లైన్‌లోనూ అందని పెన్నా ఇసుక
- ఉచిత ఇసుక లభ్యం కాక జనం గగ్గోలు
- దొరికినా కళ్లు చెదిరే ధరలు
- క్రషర్ డస్ట్ మిక్స్ చేసి ఇళ్ల కట్టుబడి


సూరాయపాళెం డంపింగ్ యార్డులోని ఇసుక (ప్రస్తుతం ఖాళీ అయింది)

పొదలకూరు: పొదలకూరు పట్టణ వాసులతో పాటు చుట్టుపక్కల గ్రామాల వారు పెన్నా ఇసుక సక్రమంగా లభ్యం కాక ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణ రంగం ఇసుక అందక కుదేలవుతోంది. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం ప్రవేశపెట్టినప్పటికీ ఇసుక అందడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. పొదలకూరుకు 28 కి.మీ దూరంలో సూరాయపాళెం డంపింగ్ యార్డు ఉంది. ఇక్కడ సుమారు 10 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నట్టు అధికారులు వెల్లడిస్తున్నా ఎవరికి ఇసుక అందుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. వారంలో ఒక పర్యాయం మాత్రమే ఆన్‌లైన్లో ఇసుక వెబ్‌సైట్‌ను ప్రభుత్వం ఓపెన్ చేస్తున్నట్టు చెపుతున్నారు. అదికూడా అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో వెబ్‌సైట్ ఓపెన్ అవుతూ కేవలం 20 నిమిషాల్లోనే ఇసుక నిల్వలు నిల్ అని చూపుతుండడంతో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న వారు ఇసుక లభ్యం కావడం లేదని వాపోతున్నారు. పెన్నా ఇసుకకు మంచి డిమాండ్ ఉంది. నిర్మాణ రంగంలోని బిల్డర్లతోపాటు వ్యక్తిగతంగా ఇళ్లు నిర్మించుకునే వారు కూడా పెన్నా ఇసుక దొరక్క ఇబ్బంది పడాల్సి వస్తోంది.

ప్రత్యామ్నాయంగా కంకర మట్టి

ఇసుక సక్రమంగా లభ్యం కాకపోవడంతో పట్టణంలోనే చాలా ఇళ్లు అర్ధాంతరంగా నిలిచిపోతున్నాయి. దీంతో కట్టుబడికి కంకర మట్టి(డస్ట్) వినియోగిస్తున్నారు. డస్ట్‌లో కొంత మేర ఇసుకను కలిపి ఇంటి కట్టుబడి చేస్తున్నట్టు మేస్త్రీలు వెల్లడించారు. డస్ట్‌తో నిర్మాణం చేపట్టవచ్చునని అయితే ఇసుకకు ఉన్నంత దృఢత్వం డస్ట్‌తో నిర్మిస్తే ఉండదంటున్నారు. ఇసుకకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని స్టోన్ క్రషర్స్ వద్ద డస్ట్ ధరలను కూడా అమాంతం పెంచేశారు. 16 టన్నుల టిప్పర్ ప్రస్తుతం రూ.7,500 లకు అమ్ముతున్నారు. నిన్నటి వరకు రూ.6 వేలకు లభ్యం అవుతున్న డస్ట్ ఒక్కసారిగా అదనంగా రూ.1,500 పెరగడంపై నిర్మాణ రంగంలోని వారు ఆందోళన చెందుతున్నారు. గతంలో డస్ట్‌ను క్రషర్స్ వద్ద ఉచితంగా అందజేసేవారు. ఇసుకకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని డస్ట్‌ను మిక్స్ చేసి ఇళ్ల కట్టుబడికి ఉపయోగిస్తుండడంతో ధరలు పెంచుతున్నారు. సామాన్యుడు ఇంటి నిర్మాణం చేపట్టాలంటే గగనం అవుతోందంటున్నారు. ట్రాక్టర్ ఇసుక పొదలకూరులో రూ.6,500 నుంచి రూ.7 వేల వరకు ధర పలుకుతోంది. ఇసుక వ్యాపారం చేసేవారు డంపింగ్ యార్డు నుంచి తోలుకుని అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. దీంతో ఉచిత ఇసుక విధానంపై వినియోగదారులు మండిపడుతున్నారు. ఇసుకను అందుబాటులో ఉంచాల్సిందిగా అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.


నిర్మాణంలో ఉపయోగిస్తున్న స్టోర్ క్రషర్ డస్ట్


అర్ధాంతరంగా నిలిచిపోయిన ఇంటి నిర్మాణం

ఇసుక అందదు.. పని దొరకదు

- పనుల్లేక పూట గడవడం కష్టంగా ఉంది
- భవన నిర్మాణ కార్మికుల ఆవేదన

కోవూరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భవిష్యత్తు అవసరాల కోసం ముందు చూపుతో ప్రజలకు సమీపంలో ఇసుక నిల్వలకు చర్యలు తీసుకుంది. పల్లిపాడు, మినగల్లులో రీచ్‌లు ఏర్పాటు చేసింది. అప్పట్లో ఈ స్టాక్ పాయింట్లను అవినీతి కొండలంటూ అసత్య ప్రచారం చేసిన కూటమి నాయకులు అధికారంలోకి రాగానే ఇసుక అక్రమ తరలింపునకు తెరతీశారు. రాత్రి సమయాల్లో విడవలూరు మండలంలోని ముదివర్తి పరిసర ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా చేశారు. ఇటీవల కొడవలూరు పోలీసులు రెండు టిప్పర్లను కూడా పట్టుకున్నారు. కూటమి నాయకుల ఒత్తిళ్లతో అధికారులు పాత స్టాక్ రికార్డుల జోలికి వెళ్లకుండా ఉన్న స్టాక్ వివరాలనే ప్రకటించారు. పేరుకు ఉచితమే అయినా రవాణా, కూలీలు, వెయిటింగ్ చార్జీలు తదితర రూపాల్లో గతంతో పోలిస్తే 20 టన్నుల లారీకి రూ.4 వేల నుంచి రూ.7 వేలు వరకు వినియోగదారులపై అదనపు భారం పడుతోంది. ఇసుక కొరతతో కుదేలవుతున్న భవన నిర్మాణ రంగంలో ఉపాధి కరువై, పొరుగు రాష్ట్రాలకు కార్మికులు వలస పోతున్నారు.

బెంగళూరుకు వెళ్లి పనిచేస్తున్నా



రాష్ట్రంలో ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణాల పనులు నిలిచిపోయాయి. మాలాంటి వారికి పనులు లేక కుటుంబ పోషణ కోసం బెంగళూరుకు వెళ్లి పనులు చేసుకుంటున్నాం. కూటమి ప్రభుత్వం చెప్పిన హామీ మేరకు ఉచిత ఇసుకను ఇప్పటికీ ఇవ్వలేకపోతోంది. ఇసుక అందుబాటులోకి వచ్చినపుడే మళ్లీ ఇక్కడికి వచ్చి పనులు చేసుకుంటాం.

– వై.కోటేశ్వరరావు, పడుగుపాడు

సామాన్యుడికి అందడం గగనమే



సామాన్యుడు ఇసుక తోలుకోవడం గగనంగా మారింది. చెంతనే ఇసుక ఉన్నా ఇంటి కట్టుబడికి తోలుకోవాలంటే అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో వాగులు, వంకల్లో ఉన్న ఇసుక ఇంటి నిర్మాణానికి పనికిరాదు. దీంతో పెన్నా ఇసుకనే నిర్మాణానికి వినియోగించాల్సి ఉంటుంది.

– కే.కృష్ణారెడ్డి, మహ్మదాపురం

ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోతున్నాయ్



డిమాండ్ మేరకు ఇసుక దొరకనందు వల్ల ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోతున్నాయి. ఇంటి నిర్మాణం చేపట్టే వారు బ్లాక్‌లో అధిక ధరకు ఇసుకను కొనుగోలు చేస్తున్నారు. కొందరు అధిక ధర చెల్లించలేక నిర్మాణ పనులను ఆపుకుంటున్నారు. ఫలితంగా తాపీ మేస్త్రీలకు ఉపాధి లేకుండాపోతోంది. అందరికీ అందుబాటులో ఉంచితేనే నిర్మాణ రంగంలో వేగం పెరుగుతుంది.

– ఎస్.వేమారెడ్డి, మేస్త్రీ, పొదలకూరు

క్లుప్తంగా

ఖరీఫ్‌లో సాగుపై క్షేత్ర పరిశీలన

ఇందుకూరుపేట: ఖరీఫ్ సీజన్లో ఇందుకూరుపేట వ్యవసాయ శాఖ సిబ్బంది పంట వివరాలు నమోదు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ కమిషనరేట్ వారు కొంతమంది రైతుల పొలాల సర్వే నంబర్లను సూపర్ చెక్ కోసం పంపారు. వ్యవసాయ శాఖ సిబ్బంది నమోదు చేసిన సర్వే నంబర్లలో పొలంలో పంట వేసి ఉన్నారా లేక వేరే ఇతర పంటలు ఉన్నాయా అని చెక్ చేసి నివేదికను ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందని ఇందుకూరుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు ఏ రాజ్‌కుమార్ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కొత్తూరు విద్యార్థి

ఇందుకూరుపేట: కర్నూలు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పల్లా వెంకటేష్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున శనివారం ప్రకటనలో తెలిపారు.

అధిక సంఖ్యలో దరఖాస్తులు వేయండి

- ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వర్లు

పొదలకూరు: ప్రభుత్వం ఆదాయం పెంపొందించుకునేందుకు మద్యం దుకాణాల లైసెన్సుల కోసం పోటీతత్వం పెరగాలని ఈ క్రమంలో దరఖాస్తులు అధిక సంఖ్యలో దాఖలు చేయాల్సిందిగా పొదలకూరు ఎక్సైజ్ సీఐ వి.వెంకటేశ్వరావు పేర్కొన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్సు పొందిన వారు ఏడాదికి ఆరు విడతల్లో లైసెన్సు ఫీజు చెల్లించవచ్చునన్నారు. బ్యాంకు గ్యారెంటీల విషయంలో కూడా ప్రభుత్వం సులభతరం చేసినట్టు పేర్కొన్నారు. షాపుల ఏర్పాటులో గతంలో ఉన్న విధివిధానాలే అమలవుతాయని, ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటలకు దరఖాస్తుల స్వీకరణ పూర్తి అవుతుందని, 5 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లో స్వీకరించమన్నారు. 11వ తేదీన లాటరీ పద్ధతిలో షాపులను కేటాయించడం జరుగుతుందన్నారు.

విజిలెన్స్ దాడుల్లో రేషన్‌షాపు సీజ్

పొదలకూరు: పట్టణంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం రేషన్ షాపులపై దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ఒక రేషన్‌షాపు, ఎండీయూ వాహనాన్ని సీజ్ చేశారు. సివిల్ సప్లయిస్ డీటీ ఐ.రవి కథనం మేరకు వివరాలు.. విజిలెన్స్ సీఐ శ్రీహరి, తహసీల్దార్ కృష్ణప్రసాద్ షాప్ నంబరు 57 (వేళాంగిణి)పై దాడులు నిర్వహించగా బియ్యం, కందిపప్పు, చక్కెర పంపిణీలో అవకతవకలు ఉన్నట్టు గుర్తించారు. పట్టణంలో రంతుల్లా ఎండీయూ వాహనం ఒక్కటే పనిచేస్తుండడంతో తనిఖీ చేయగా సరుకుల పంపిణీలో తేడా ఉండడంతో రేషన్‌షాపు, ఎండీయూ వాహనాన్ని సీజ్ చేసి డీటీకి అప్పగించారు.

వెంకయ్యస్వామికి విశేష పూజలు


పూజలందుకుంటున్న వెంకయ్యస్వామి

మనుబోలు: మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో ఉన్న భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి విశేష పూజలు జరిగాయి. అర్చకులు శ్రీనివాసులు ముందుగా వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారికి పంచామృతాభిషేకం జరిపించి పుష్పాలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వివాహం, సంతానం కోసం పలువురు ధుని పూజ నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మలు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి కాకాణి పరామర్శ


రవీంద్రరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: మండలంలోని వరిగొండ పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకుడు గుండాల రవీంద్రరెడ్డిని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం పరామర్శించారు. అనారోగ్యానికి గురైన రవీంద్రరెడ్డి ఇటీవల శస్త్రచికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకొంటున్నారు. ఈ క్రమంలో శనివారం వరిగొండలోని ఆయన నివాసానికి మాజీ మంత్రి కాకాణి చేరుకొని ఆయనను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం స్థానిక పార్టీ కార్యకర్త కోట్లపూడి సుధాకర్ కుమారుని వివాహానికి కాకాణి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఉప్పల శంకరయ్య గౌడ్, నాయకులు గూడూరు విష్ణుమోహన్‌రెడ్డి, కామిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఒబ్బారెడ్డి సురేష్‌రెడ్డి, సుబ్బారెడ్డి, జానా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు దసరా వేడుకలు


నృత్యాల ద్వారా నవరాత్రుల విశేషాలను వివరిస్తున్న దృశ్యం

ముత్తుకూరు: కృష్ణపట్నం అదాని వరల్డ్ స్కూల్‌లో శనివారం ముందస్తు దసరా వేడుకలు కోలాహలంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సత్యనారాయణ మాట్లాడుతూ చెడును పారద్రోలి మంచిని ఆహ్వానించడమే ఈ పండుగల ముఖ్య ఉద్దేశమన్నారు. విద్యార్థి దశ నుంచే మంచిని అలవరచుకోవాలన్నారు. అనంతరం రావణాసురుడి బొమ్మను తయారు చేసి దానిని సంహారం చేసే విధంగా దృశ్యాన్ని ఆవిష్కరించారు. నవరాత్రుల విశేషాలను వివరిస్తూ విద్యార్థులు చక్కగా నృత్యాలు చేశారు. అకడమిక్ హెడ్ రాబిన్, కోఆర్డినేటర్ ఉష, సుమన్, దేవకి పాల్గొన్నారు.

సరస్వతి విగ్రహానికి పూజలు


సరస్వతీదేవి విగ్రహానికి పుష్పాలంకరణ చేసిన కాలేజీ స్టాఫ్

విడవలూరు: స్థానిక పీఆర్ఆర్ – వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ముందస్తు దసరా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బి.సుజాత మాట్లాడుతూ విద్యార్థులు అందరికీ అమ్మవారి ప్రేమ, కరుణ, కటాక్షాలు అందాలని, అదే విధంగా ధైర్యం, పట్టుదలకు దుర్గామాత స్ఫూర్తిదాయకం అని తెలియజేశారు. అనంతరం కళాశాలలోని సరస్వతీ దేవి విగ్రహానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.మధు, కళాశాల ఫెస్టివల్ కమిటీ కన్వీనర్ పి.ప్రియాంక, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు ముగిసిన శిక్షణ


అధ్యాపకులకు శిక్షణా పత్రాలందజేస్తున్న చైర్మన్ గుణశేఖర్

కొడవలూరు: నార్తురాజుపాలెంలోని శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో అడ్వాన్స్‌డ్ టూల్స్ అండ్ టెక్నాలజీ ఫర్ రీసెర్చ్ డెవలప్ అనే అంశంపై అధ్యాపకులకు వారం రోజులుగా జరిగిన శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ పరిశోధనా రంగంలో సాంకేతికతతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. అనంతరం అధ్యాపకులకు కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ శిక్షణా పత్రాలను అందజేసి మాట్లాడారు. అధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అధ్యాపకుల్లో పరిపక్వత సాధించడానికి శిక్షణా తరగతులు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ శిక్షణ బోధనలో ఎంతగానో ఉపకరించి విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేస్తుందని అభిలషించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌డీ డీన్ వెంకట నాగేంద్ర, ప్రిన్సిపల్ డాక్టర్ ప్రకాష్‌రావు, ఏఓ గిరీష్‌కుమార్‌లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటారు బైక్‌ను ఆటో ఢీకొని వ్యక్తి గాయపడిన సంఘటన మండలంలోని సర్వేపల్లి సమీపంలో శనివారం జరిగింది. గూడూరు పట్టణానికి చెందిన మురళీకృష్ణ పని నిమిత్తం మోటారు బైక్‌పై కృష్ణపట్నం వెళ్లాడు. తిరిగి గూడూరుకు వెళుతుండగా సర్వేపల్లి సమీపంలో పోర్టు రహదారిపై ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో మురళీకృష్ణకు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భానుడి భగభగలు

పొదలకూరు: అక్టోబరు మాసంలో మే నెలలో కాసే ఎండలను చూస్తున్నామని జనాలు నివ్వెరపోతున్నారు. ఇటీవల అకాల వర్షం, అల్పపీడనం వంటి కారణాలతో ఎండలు తగ్గుముఖం పట్టాయని ప్రజలు భావించారు. అయితే మళ్లీ భానుడు భగభగలు మొదలయ్యాయి. రాత్రివేళల్లో జనాలు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. పగటి వేళల్లో 11 గంటలకు మే నెలను తలపించే ఎండలు కాస్తున్నాయి. రోడ్లపై జనసంచారం ఉండడం లేదు. గాలిలో తేమశాతం లేకపోవడంతో పిల్లలు, వృద్ధులు అల్లాడుతున్నారు. సాయంత్రం కొద్ది సమయం ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురుస్తుందనుకునే సమయానికి తేలిపోయి తిరిగి ఉక్కపోత మొదలవుతోంది. గతంలో అక్టోబరు నెలలో ఇంతలా ఎండలు ప్రతాపం చూసింది లేదని వృద్ధులు చెబుతున్నారు.

కాపుల పట్టాభిషేకం 12న

ముత్తుకూరు: ముత్తుకూరు మండలం కృష్ణపట్నం పంచాయతీలోని ఆర్కాట్‌పాళెం గ్రామానికి చెందిన నూతన కాపుల పట్టాభిషేకం ఈ నెల 12వ తేదీన జరుగుతుందని గ్రామపెద్దలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పట్టాభిషేక ఉత్సవంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి పాల్గొంటారని వెల్లడించారు.

అన్నపూర్ణగా దుర్గాదేవి

మనుబోలు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మనుబోలు కోదండరామపురంలోని పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు శనివారం అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు శ్రీనివాసులు అమ్మవారికి అన్నపూర్ణదేవి అలంకారం చేసి శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, శ్రీచక్ర అర్చన, నవావరణ పూజ ఖడ్గమాలార్చన నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా వావిలేటి మనోన్‌కుమార్, సుమాంజలి దంపతులు వ్యవహరించారు.

పేదలకు ఉచిత న్యాయ సహాయం

కోవూరు: జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికారుల సంస్థ ఆధ్వర్యంలో కోవూరు ఐసీడీఎస్ ప్రాజెక్టులో విధాన్ సే సమాధాన్ మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా నెల్లూరు పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు, ముఖ్యఅతిథిగా కోవూరు సీనియర్ సివిల్ జడ్జి చైతన్య పాల్గొన్నారు. మహిళా సాధికారత, మహిళల హక్కులు, పిల్లల సంరక్షణ, మహిళా చట్టాలపై పలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ప్రశాంతి, రాంబాబు, ఐసీడీఎస్ సీడీపీఓ జ్యోతి, అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బాలాత్రిపుర సుందరి అలంకారంలో అమ్మవారు


బాలాత్రిపుర సుందరి అలంకారంలో కన్యకాపరమేశ్వరీదేవి

పొదలకూరు: పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరీదేవి దేవస్థానంలో శరన్నవరాత్రుల సందర్భంగా శనివారం అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉభయ కర్తలుగా అమరా వెంకటకృష్ణయ్య(భగవాన్), కొమ్మూరు ప్రసాద్, రాము వ్యవహరించారు.

సంతానలక్ష్మిగా అమ్మవారు

పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదాసమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో సంతానలక్ష్మి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉభయకర్తలుగా గాలి వెంకటేష్, అనూరాధ, స్వర్ణ హంసకుమార్, నంది దంపతులు వ్యవహరించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించారు.

కాంతమ్మతల్లి ఆశ్రమంలో

ఇనుకుర్తి కాంతమ్మతల్లి ఆశ్రమంలో అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. శరన్నవరాత్రుల సందర్భంగా ఆశ్రమంలో ప్రత్యేకపూజలు, అభిషేకాలను నిర్వహించారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల పరిశీలన


దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎక్సైజ్ శాఖాధికారి

బుచ్చిరెడ్డిపాళెం: మద్యం దుకాణాల వేలం పాటకు సంబంధించి దరఖాస్తులను బుచ్చిరెడ్డిపాళెం ఎక్సైజ్ స్టేషన్‌లో జిల్లా డిప్యూటీ కమిషనర్ టి. శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. ఆసక్తి గలవారు స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని బుచ్చిరెడ్డిపాళెంలోని ఆరు దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.పి.కిషోర్‌కు పలు సూచనలు చేశారు.

అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి

తోటపల్లిగూడూరు: భక్తుల కొంగు బంగారంగా విలసిల్లుతున్న వరిగొండ జ్వాలాముఖి అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం వరిగొండ జ్వాలాముఖి అమ్మవారి ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ క్రమంలో సోమిరెడ్డి అమ్మవారికి చీరను సారెగా అందించి ప్రత్యేక పూజలను చేపట్టారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ వరిగొండ జ్వాలాముఖి అమ్మవారి ఆలయ అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానన్నారు. అనంతరం వరిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అభివృద్ధి పనులపై అధికారులు చర్చించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కోడూరు శ్రీనివాసుల రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్ రెడ్డి, ఆలయ ఈఓ తాతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం ప్రారంభం


రేషన్ షాపులో బయోమెట్రిక్ వేస్తున్న మహిళ

మనుబోలు: మండల కేంద్రంలోని కోదండరామపురం సెంటర్‌లో శనివారం కొత్తగా ప్రభుత్వ రేషన్ దుకాణాన్ని ప్రారంభించారు. మండల కేంద్రంలో ఇప్పటికే రెండు రేషన్ షాపులు ఉన్నప్పటికి జనాభా దృష్ట్యా అవి సరిపోవడం లేదని గ్రామస్థులు ఫిర్యాదులు చేస్తుండడంతో కొత్తగా సినిమా హాల్ ఎదురుగా మరో రేషన్ షాపు ఏర్పాటు చేశారు. బీసీ కాలని, గిరిజన కాలని, కోదండరామపురం మెయిన్‌లో ఉన్న లబ్ధిదారులకు ఈ షాపు అనుకూలంగా ఉంటుందని స్థానికుడు రాజాగౌడ్ తెలిపారు.

9 నుంచి సోషల్ ఆడిట్


శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పార్పీ నాగార్జున

మనుబోలు: ఈనెల 9వ తేదీ నుంచి మండలంలోని అన్ని గ్రామాలలో సోషల్ ఆడిట్‌లో భాగంగా ఉపాధి హామీ పనులపై తనిఖీలు నిర్వహిస్తామని స్టేట్ రిసోర్స్ పర్సన్ నాగార్జున తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం డీఆర్‌పీలకు సోషల్ ఆడిట్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో రూ.93.18 లక్షల ఖర్చుతో 396 పనులు పూర్తి చేసినట్లు రికార్డుల్లో ఉందని వివరించారు. ఈ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ రాజమ్మ, ఈసీ సుప్రజ, టిఏ గుర్రప్ప ఉన్నారు.